# ముసుగు

"ఉద్యోగాలు లెవ్వంటారు... చదువుకుని నిరుద్యోగులుగా వున్నవాళ్ళు వేలకొద్ది ఉన్నారు... ప్రభుత్వం వుద్యోగాలిస్తాం మొర్రో, పల్లెల్లో పని చెయ్యండంటే... నేసేమిరా వెళ్ళమంటూ భీష్మించుకుంటారు డాక్టర్లు! అందరికీ పట్నాల్లోనే వుద్యోగాలు కావాలనుకుంటే... ఇక పల్లెల్లోవారి బాగోగుల గురించి పట్టించుకునేదెవరూ అంట?..." రచ్చబండమీద కూర్చున్న నలుగురి పెద్దల్లో ఒక మోతుబరి చేతిలో పేపరు పక్కనపెట్టి చుట్ట వెలిగిస్తూ అన్నాడు. ఆయన పేరు పెద్దిరెడ్డి.

"మన సమితిలో ఆస్పత్రి కట్టించి ఆరేళ్ళయింది! మూడేళ్ళుగా డాక్టర్ రాక... మరో మూడేళ్ళు మందులు సప్లయిలేక... మూతబడి ఉంది!" నిట్టూర్చేడు నూకరాజు. ఆ వూళ్ళో వున్న స్కూల్లో పనిచేస్తున్న ఒకే ఒక టీచరు నూకరాజు!

"ఇదిగో అయ్యోరూ! నువ్వు పిల్లలకు సదువు సెప్పటం ఎంత సక్కగా వుందో... మన వూరి మొండిగోడలతో పైకప్పులేని బడే సెబుతోంది!..." వెటకారం, దెప్పిపొడుపు ధ్వనించాయి నాంచారయ్య మాటల్లో.

"దిక్కూ మొక్కూ లేని మనూరికి నేను ప్రెసిడెంట్‌నయ్యాక ఆసుపత్రి కట్టించానా? ఆ!... బడి కట్టిద్దామనుకుంటే... దీన్నిగదరగ... స్థలం మనూరోళ్ళు దానం చేసినా... కట్టుబడికి ఫండులేక ఆగిపోయె... ఇహపోతే... మనూరోళ్ళంతా శ్రమదానం చేసి రోడ్డేసినా... బస్సు సౌకర్యంకూడా మనూరికి లేకుండాపోయె..." చెప్తూ ఆగిపోయాడు చిన్న చౌదరి.

"ఇదిగో... నువ్వు కుర్రాడివి!... వయసులో వున్నోడివి... కష్టపడి పనిచేసి మనూరిని బాగు చేస్తావనేసి ఓట్లేసి మనూరోళ్ళంతా కల్సి నిన్ను ప్రెసిడెంట్‌ని చేశారు. అవునా?! నీకేమో మన వూళ్ళో పన్లంటేనే పట్టవ్. సంవత్సరానికి పదినెలలు నువ్వెళ్ళి పట్నంలోనే కూర్చుంటావాయె! మనూరికి బస్సు వచ్చేట్టు చేశావన్నమాటేగాని... ఎండాకాలం మూడునెళ్ళు తిరిగి ఆగిపోయిందా బస్సు! అదేమంటే... నష్టంమీద బస్సు తిప్పటం సాధ్యంకాదని ఆర్టీసీవోళ్ళు అన్నారా? అహ... అన్నారు గదా?... మరేందయ్యా నువ్వు ఒరగబెట్టింది?..." గట్టిగానే మాట్లాడేడు పెద్దిరెడ్డి.

చిన్నచౌదరి మనస్సు చివుక్కుమంది.

''ఇంకా ఏందండీ చేసేది? మనూరి చెరువులో వర్షాలేక నీళ్లెండిపోతే... వూళ్ళో బోరు పంపు వేయించానా?... కరెంట్ తెప్పించి వీధి దీపాలు వేయించానా?'' నొసలు చిట్లించి జవాబిచ్చాడు చౌదరి.

ఆ మాటలకు పకపకా నవ్వేరు అక్కడున్నవాళ్ళు.

చౌదరి సీరియస్‌గా వారి మొహాల్లోకి చూసేడు.

''కరెంటొచ్చింది సరేనయ్యా... వీధి దీపాలు వెలగటం లేదుగా!...''

''బోర్లేపించావ్ బాగానే వుంది... అవేవెూ సగం విరిగిపోయి వుపయోగపడకపోయె...''

వారిద్దరి మాటలు చురకల్లా తగిలేయి!

''మీరాగండహె! మాటలెందుగ్గానీ... ముందు మనూరికి డ్క్టరొచ్చేట్టు చూడు చౌదరీ! రోగమొస్తే సూది మందిచ్చే నాధుడే లేడు మనకు. మొన్నటికి మొన్న... మన ఆచారి... అదేనయ్యా బంగారప్పని చేస్తాడే... ఆయన కూతురికి ధనుర్వాతం వచ్చి... ట్రాక్టర్ మీద పట్నానికి తీసుకెళ్ళాల్సి వచ్చె! అంతదూరం కష్టపడి తీసుకెళ్ళినా... కూతుర్ని దక్కించుకోలేకపోయె ఆచారి!... ఏందయ్యా ఈ దౌర్భాగ్యం మనకు..'' నిష్ఠురంగా మాట్లాడేడు మునసబు.

''చౌదరికి కోపం తెప్పించకండయ్యా!... అసలే కుర్రాడు!... అనవసరంగా వుద్రేకపడిపోతాడు! అంతా మనూరోళ్ళ ప్రారబ్ధకర్మ!... అది సరేగానీ...ఇవ్వాళ పేపర్లో విశేషాలేంటో కాస్త చదివి చెప్పండి పెద్దిరెడ్డిగారూ!...'' టాపిక్ మార్చాలనే వుద్దేశంతో అడిగేడు నూకరాజు.

''వార్తలేమున్నయ్... డ్క్టర్ల సమ్మె... ఎన్జీవోల స్ట్రయిక్... ఆర్టీసీ సమ్మె... ఎలక్ట్రిసిటీపనివారిచే రాష్ట్రవ్యాప్త బందు... నర్సుల నిరసన... పారిశుద్ధ్యపనివారిచే రాస్తారోకో... భర్త నెదిరించిన భార్య బలి!... కనకాయపాలెంలో వరకట్నపు చావు... ఏ పేజీలో చూచినా విశేషాలు ఇవ్వేనాయె...'' పెద్దిరెడ్డి నిట్టూర్చాడు.

''ఇంతకూ అసలు సమ్మె చెయ్యని వాళ్ళెవరంట మన దేశంలో...?'' వెటకారం చోటు చేసుకుంది మునసబు ప్రశ్నలో.

''జీతభత్యాలు లేని మనం వున్నాంగా? మట్టి పిసుక్కుంటూ... పొలం దున్నుకుంటూ... అర్ధాకలితో బతుకుతున్న రైతులం! - వర్షం కోసం ఆకాశం కేసి చూస్తూ... పంట చేతికందుద్దో లేదోనని సగం ఎండిపోయే పైర్లకేసి చూస్తూ... అప్పులెలా తీర్తాయాని దిగులుతో... ఏడిచేందుకూ్కడా కళ్ళల్లో నీరెండిపోయిన మనమే ఏ సమ్మె

చేయనిది!!'' పళ్ళు పటపట కొరుకుతూ వుక్రోషంతో అన్నాడు బాబయ్య. అతనొక వృద్ధ రైతు! నడుం వంగిపోయినా... తల ముగ్గుబుట్టయినా, కాడిపట్టుకుని పొలం దున్నుకుంటూ సేద్యం చేసుకుని, చావలేక బతుకున్న మనిషి.

'రైతులు కూడా సమ్మె చేస్తే... అంతా మాడి చావాల్సిందే... మనందరికీ బువ్వెట్టా?... అందుకే మన పొట్ట నిండినా నిండకపోయినా... ఇతరులను బతికించేందుకు రెక్కలు ముక్కలు చేసుకోక తప్పటంలేదు...'' నిట్టూరుస్తూ అన్నాడు బాబయ్య.

రచ్చబండ మీద వున్న వాళ్ళంతా ప్రతిరోజూ ఈ విధంగా మాట్లాడుకోవడం పరిపాటి. ఒకరినొకరు విమర్శించుకున్నా మళ్ళీ కలిసిపోయి సఖ్యతగా మసలుకునే మంచి మనసు వారికుంది.

''అటు చూడండి!... మన వూరికి కొత్త మనిషెవరో వస్తున్నట్టుంది... ఆ వచ్చే చుట్టం ఎవరింటికో...'' దృష్టిసారించిన మునసబు, మిగతావారి తలలు అటుకేసి తిప్పేట్టు చేశాడు.

తెల్లని శరీరఛాయ... వుంగరాల జుత్తు... ఐదడుగుల పది అంగుళాల ఎత్తు... బిస్కట్ రంగు పాంటు... ఆకాశం రంగు ఫుల్‌హాండ్ షర్ట్... ఒకచేతిలో బ్రీఫ్‌కేసు, మరో చేతిలో బ్యాగ్‌తో... చిరునవ్వుతో రచ్చబండ దగ్గరకొచ్చి నిల్చున్నాడు ఆగంతుకుడు.

అతను లగేజి నేలమీందుంచి రెండు చేతులూ జోడించేడు అక్కడున్న పెద్ద లందరికేసి చూస్తూ.

నమస్కారాన్ని ఘనంగా స్వీకరించినట్టు హుందాగా నవ్వేరు సమష్టిగా. ఆ తర్వాత ఒకరిముఖా లొకరు చూచుకున్నారు నొసలు చిట్లించి.

''మీ అందరి సహకారం... సహాయం కోరి... ఇంత దూరం వచ్చాను...'' వినయం వుట్టిపడ్డది అతని మాటల్లో.

''ఇంతకూ... నువ్వెవరో... నీ పేరేమిటో... ఈ వూరెందుకొచ్చావో...'' అర్థోక్తిలో ఆగిపోయాడు పెద్దిరెడ్డి.

'నేను డాక్టర్ని... నా పేరు సంతోష్...''

ఆ మాట వినగానే అక్కడివారి ముఖాలు కాంతివంతమైనయ్.

'పేద ప్రజలకు సేవ చేయాలని ఇక్కటికొచ్చాను. పైగా ఈ వూళ్ళో డాక్టర్ లేకపోవడంతో మీరంతా ఎంతో ఇబ్బందిపడుతున్నారనికూడా విన్నాను...''

''నిన్నీ వూరు ఆస్పత్రికి వేశారా డాక్టర్ బాబూ?...'' మునసబు ప్రశ్న.

''కాదండీ! ఈ వూళ్లో మీ అందరి సహకారంతో ప్రైవేటు ప్రాక్టీసు పెట్టాలని వచ్చాను...''

''సుబ్బరంగా సిటీలో సుఖంగా వుండాక... మట్టి వూరును వెతుక్కుంటూ వచ్చావా బాబూ?...పల్లెటూళ్ళో వ్యాపారం చెయ్యటానికి సిద్ధపడి వచ్చినవాడ్ని నిన్నొక్కడినే చూస్తున్నాను...'' పెద్దిరెడ్డి అన్నాడు.

''అయ్యా డాక్టరూ!... మా వూరు సిటీకాదు కనుక ఇక్కడ సెప్టిక్ లెట్రిన్లు వుండవ్... పైగా, రెండు రోజులకోసారి స్నానం చెయ్యాల్సి వస్తుంది... ఎంచేతంటే, మా వూళ్ళో నీటి ఎద్దడి జాస్తి!... గొట్టపు బావులు చెడిపోయినయ్... చెరువేమో ఎండిపోయింది...'' నూకరాజు అందుకున్నాడు.

వాళ్ళ మాటలకు తొణకలేదు సంతోష్.

''ఇంతకూ... తమరికి పెళ్ళయిందా?'' ప్రశ్నించాడు బాబయ్య.

''లేదండి!... నేను డాక్టర్ పట్టా పుచ్చుకున్నది మొదలు... నాకు పెళ్ళిచేసి కనీసం లక్ష రూపాయలన్నా కట్నం రాబట్టాలని మా అమ్మగారి ప్రయత్నం;గవర్నమెంట్ వుద్యోగం పట్నంలోనే చేయించాలని మా నాన్నగారి పట్టుదల... ఇద్దర్నీ కాదని ఈ వూరొచ్చాను. మీరు నాకు ఆశ్రయం కల్పిస్తే... నా శక్తివంచన లేకుండా... మీ ఊరి ప్రజలకు సేవ చేస్తాను...''

''సర్లే... ఎంతో దూరం నుండి పనిగట్టుకుని... ఆశపెట్టుకుని వచ్చినోడివి నిన్నెందుకు కాదనాలి?! పైగా మా వూరికి కూడా ఓ డాక్టరు అవసరం...'' చిన్న చౌదరి ఆహ్వానం పలికేడు.

''అయితే ఇంకేం?... నా డాబామీద ఖాళీగా వున్న గదిలో వుండిపో డాక్టరూ!'' ఛాన్సు తనే తీసుకున్నాడు పెద్దిరెడ్డి.

పెద్దిరెడ్డి ఒత్తుమీసాల కేసి... రాగి చెంబులా వున్న బట్టతలకేసి అదోలా చూస్తూ నవ్వేసి తలూపాడు సంతోష్.

''మరి... మందులు... ఇంజీషన్లు కావాలంటే ఎట్టా?... మా వూళ్ళో మందుల షాపే లేదే...'' బాబయ్య సందేహం వెలిబుచ్చాడు.

''అదొక సమస్యే కాదు! మన వూళ్లో ఎవరిచేతనైనా చిన్నసైజు మెడికల్ షాపు తెరిపిస్తే సరిపోతుంది. ఏవేవి ఎన్నెన్ని కావాల్సి వస్తాయో? అన్నీ నేనే చెప్తాను...'' అందరికేసి చూస్తూ చెప్పేడు సంతోష్.

ఆ మాటకు అంతా తృప్తిపడ్డారు.

రచ్చబండమీద కూర్చున్న వారంతా లేచి ఇళ్ళకు బయల్దేరేరు.

పెద్దిరెడ్డివెంట నడిచేడు సంతోష్.

★★ ★★ ★★

డ్యాక్టర్‌సంతోష్‌కి పెద్దిరెడ్డి ఆశ్రయం ఇచ్చినందుకు నొచ్చుకున్నాడు చిన్నచౌదరి.

కొన్ని రోజులుగా ఇదే ఆలోచన చిన్నచౌదరిని వేధించనారంభించింది.

అంటే... తాను ప్రెసిడెంట్ అయివుండికూడా ఆ వూరి ఆస్పత్రికి డ్యాక్టర్ని వేయించలేదనేగా?... అందుకేగా... ఆశ్రయం ఇచ్చి తన ఘనత చాటుకోవాలని చూస్తున్నది పెద్దిరెడ్డి?...అని లోలోపలే మధనపడసాగేడు చిన్నచౌదరి.

చిన్నచౌదరి అహం దెబ్బతిన్నది.

రెడ్డి, చౌదరిల మధ్య క్రమేపీ వైరం చోటు చేసుకుంటోంది. కులవైషమ్యాల మధ్య డ్యాక్టర్ సంతోష్ పరిస్థితి కుడితిలోపడ్డ ఎలుకలా తయారైంది.

పెద్దిరెడ్డి ఆసరాతో ప్రాక్టీస్ బాగానే పుంజుకుంది.

కాస్తో కూస్తో డబ్బు వెనకేసుకోగలుగుతున్నాడు సంతోష్.

చిన్నచౌదరి కన్నెర్ర చేసిన కారణంగా అతని వర్గం మనుష్యులెవ్వరినీ డ్యాక్టరు దగ్గరకు ట్రీట్‌మెంట్ కోసం వెళ్ళనివ్వకుండా అరికట్టగలుగుతున్నాడు.

తన బావమరిది పట్నంలో మెడిసిన్ చదువుతున్నాడు. మరో ఆరునెలల్లో హవున్‌సర్జన్ షిఫ్ పూర్తి చేసుకుంటాడు. వెంటనే బావమరిదిని పిల్చుకొచ్చి పెద్దిరెడ్డిని దెబ్బతీసి తన ప్రతాపం చూపించాలనే నిర్ణయానికొచ్చాడు చిన్నచౌదరి!ఎంతైనా రాజకీయ చతురుడు!

చిన్నచౌదరి అమోఘమైన తెలివితేటలను సంతోష్ ఆదిలోనే పసిగట్టేడు. అందుకే... ఎవ్వరితోనూ తానుగా వైరం పెంచుకునే స్థితి కల్పించుకోకుండా తెలివిగా మసులుకుంటున్నాడు.

తన హస్తవాసికూడా మంచిదనే పేరుపడ్డది ఆ వూరి మనుష్యుల్లో! కేవలం ట్రీట్‌మెంటేగాని... ఆపరేషన్ల జోలికి పోవటం లేదు.

అటు పెద్దిరెడ్డికి... ఇటు చిన్నచౌదరికి తాను వాళ్ళ మనస్సు నొప్పించకుండా వుండాలీ అంటే... రెడ్డిగారింటినుండి మకాం మార్చడమే మంచి మార్గంగా తోచింది సంతోష్‌కి.

★★ ★★ ★★

దుమ్ము లేపుకుంటూ రయ్‌మని జీపొచ్చి రెడ్డిగారింటి ముందు ఆగింది.

ఆగిన జీపులోంచి నలుగురు కానిస్టేబుల్స్... యస్సై దిగి, సరాసరి పెద్దిరెడ్డి గారింట్లోకి వేగంగా నడిచారు.

మెట్లెక్కి మేడమీది గదిలో కెళ్ళారు.

పేముకుర్చీలో కూర్చుని సంతోష్ పేపరు చదువుకుంటున్నాడు.

"మిస్టర్!... యువార్ అండర్ అరెస్ట్!!..." యస్సై గొంతు ఖంగున మోగింది.

వెంటనే సంతోష్ చేతికి బేడీలు పడ్డయ్.

నోరు మెదపలేకపోయాడు సంతోష్.

వెంట నడిపించి జీపు ఎక్కించబోతుండగ... నోట్లో వేపపుల్ల... చేతిలో చెంబుతో ఎదరొచ్చేడు పెద్దిరెడ్డి.

తన కళ్ళను తానే నమ్మలేకపోయాడు. అసలేం జరిగిందో బోధపడ్డేదు పెద్దిరెడ్డికి.

"ఐయాం సారీ రెడ్డిగారూ! మీరింట్లో లేనప్పుడు... మీ పర్మిషన్ లేకుండా వచ్చి ఇతడ్ని అరెస్టు చేయాల్సి వచ్చింది. ఇతని పేరు సంతోష్ కాదు. ఇతను డాక్టరూ కాడు! కేవలం కాంపౌండర్ మాత్రమే. ఆ అనుభవంతో దొంగ సర్టిఫికెట్ సృష్టించి డాక్టర్‌గా చెలామణి అవుతున్నాడు. అటు ప్రభుత్వం, ఇటు పోలీసుల కళ్ళుగప్పి తప్పించుకు తిరుగుతున్నాడు ఇన్నాళ్ళుగా. ఇతని అసలు పేరు నాగరాజు. ఫోర్జరీ సంతకాలతో... దొంగ రబ్బరు స్టాంపులతో డాక్టరు పట్టా సృష్టించాడు... వివరాలు తర్వాత చెప్తాను..." విషయం క్లుప్తంగా చెప్పి జీపెక్కేడు యస్సై.

తన చెవులను తానే నమ్మలేకపోయాడు పెద్దిరెడ్డి.

---

★ ( ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక 21-7-88 లో ప్రచురితం)